ఓసారి అతని పక్కింటివాళ్ళు ఓనెల పాటు తీర్థయాత్రలకి వెళుతూ, తాము పెంచుకునే గోల్డ్‌ఫిష్‌లని తిరిగి వచ్చేదాకా చూడమని ఇచ్చి వెళ్ళారు. నెల తర్వాత వాళ్ళొచ్చి వాటిని తిరిగి ఇమ్మని అడిగితే అవి చచ్చిపోయాయని చెప్పాడు.

"రోజూ నీళ్ళు మార్చలేదా?" అని అక్వేరియంలోని నీళ్ళని చూసి అడిగితే, 'ఊహు. నెల క్రితం వుంచిన నీటిని అవి తాగకుండా అలాగే వుంచేసాయి కదా ఇంకెందుకని మార్చలేదు" అని జవాబు చెప్పాడు వెంగళ్రావు.

వెంగళ్రావుని మీకు చూడాలని వుందా? అయితే మీ వూళ్ళో ఎవరయినా 'స్పీడ్ బ్రేకర్ ఎహెడ్—గోస్లో' అన్న బోర్డుచూసి నెమ్మదిగా నడుస్తూ దాన్ని జాగ్రత్తగా దాటడం మీ కంటపడితే అతనే 'మిష్టర్ వెంగళ్రావ్‌గారు' అని మీరు ఇట్టే గుర్తుపట్టేయచ్చు.

# స్నేహమేరా శాశ్వతం

స్నేహితుడు లేని వ్యక్తంటూ ఈ ప్రపంచంలో వుండడు. తలిదండ్రులు లేని అనాథకి కూడా స్నేహితులుంటారు. స్నేహంలోని మాధుర్యం అనుభవిస్తే కాని అర్థం కాదు.

సాధారణంగా వుద్యోగం వచ్చేదాకా చేసే స్నేహం ఎంతో బలంగా వుంటుంది. ముఖ్యంగా స్కూలు, కాలేజీ రోజుల్లో బాధ్యతలు బరువులు ఎక్కువగా వుండవు కాబట్టి స్నేహం చెయ్యడానికి సావకాశం, అవకాశం ఎక్కువ. కాని పెళ్ళయ్యాక బాధ్యతలు పెరిగి స్నేహానికి టైం సరిపోకపోవడం, చిన్ననాటి స్నేహితులు ఆ విధంగా వివాహానంతరం దూరం అవడం అందరికీ స్వానుభవమే. కొంతకాలం కలం ద్వారా స్నేహం కొనసాగినా క్రమంగా అదీ సన్నగిల్లుతుంది. ఆ తర్వాత భర్త లేదా భార్య, పిల్లలే స్నేహితులయిపోతారు.

ఇద్దరు అవివాహితులు క్లోజ్ ఫ్రెండ్స్‌గా వుండగా, వారిలో ఓ వ్యక్తికి వివాహం అయితే రెండో వ్యక్తి కొంతకాలం బాధపడతాడు. పెళ్ళయిన వ్యక్తికి గతంలోలా తన స్నేహితుడితో కాలం గడిపే తీరుబాటుండదు.

బాల్య స్నేహితులని చివరిదాకా స్నేహితులుగా టచ్‌లో వుంచుకునే వారు అదృష్టవంతులనే చెప్పాలి. ఒకే వూళ్ళో వుంటూ కలసి చదువుకుని, వుద్యోగానంతరం స్థాన చలనం లేనివారు చివరిదాకా ఆ ఫ్రెండ్‌షిప్‌ని కంటిన్యూ చేయగలరు. కాని ఇద్దరిలో ఒకరు వూరు మారారా, క్రమంగా ఆ దూరం వాళ్ళ స్నేహాన్ని తగ్గించేస్తూంటుంది.

నేను పి.యు.సి.లో వుండగా కృష్ణ అనే అతను నా ఫిక్కెస్టు ఫ్రెండ్. ఓ ఏడాదే కలిసి చదివాం. అతని తండ్రికి గుంటూరు బదిలీ అయితే విజయవాడనించి గుంటూరు వెళ్ళిపోయాడు అతను నెలకోసారి నేను వాళ్ళింటికి వెళ్ళొస్తూండే వాడ్ని. నేను హైద్రాబాద్‌కి వుద్యోగరీత్యా రాబోయేముందు మేం ఇద్దరం సంవత్సరానికోసారయినా కలుసుకోవాలని తీర్మానించుకున్నాం. ఆ తీర్మానం ఒకటి, రెండు సంవత్సరాలకి మించి అమలు చేయలేకపోయాం. క్రమంగా లెటర్స్ కూడా తగ్గిపోయాయి.

దాదాపు పుష్కరం తర్వాత ఓసారి క్రిష్ణ తాడిపత్రి నుంచి (అక్కడ టెక్స్‌టైల్ మిల్స్‌లో పనిచేస్తున్నాడు) హైదరాబాద్ వచ్చినప్పుడు కలిసాం. అతను నన్ను 'మీరు' అని గౌరవించడం, గతంలో లేని మర్యాదతో చూడటం చేశాడు. ఐ ఫెల్ట్ వెరీ బేడ్. ఓ రాత్రి మా ఇంట్లో వుంచి ఆ రాత్రంతా మా పి.యు.సి. రోజుల్లో ఎన్.సి.సి.లో మేం చేసిన గొడవలు, లీలామహల్‌లో చూసిన ఇంగ్లీష్ సినిమాలు మొదలయిన సంఘటనల గురించి మాట్లాడాను. మర్నాటికి అతను 'నువ్వు'లోకి వచ్చేసాడు. నేను సంఘంలోనూ, ఆర్థికంగానూ ఎదిగినా పాత మిత్రుణ్ణే' అన్న సంగతి అతను గ్రహించేలా చేయడానికి ఆ రాత్రి మా ఇంట్లో బలవంతంగా వుంచేసాను.

కొన్ని కేసుల్లో ఇందుకు రివర్స్ జరుగుతుంది. ఏ మాత్రం ఎదిగినా పాతమిత్రులకి పోజ్ కొట్టే వాళ్ళుంటారు. పాత మిత్రులు అది

K-SARACA



భరించలేక 'పోరా పుల్లాయ్' అనుకుని ఇక వాళ్ళని కలవరు. కొందరు మిత్రులు ఇంకో రకం. ఏ మాత్రం పరిచయం వున్నా వాళ్ళ పేరు వస్తే 'వాడా? నేను వాడు క్లాస్ మేట్స్' అనేస్తూంటారు.

ఓ చిత్ర దర్శకుడికి సరిగ్గా ఇలాంటి మిత్రుడే వున్నాడు. ఆయన మద్రాస్‌లో సెట్లో షూటింగ్‌లో వుంటే పాలకొల్లు నించి వచ్చే ఆ మిత్రుడు అందరి ముందు అతన్ని పాలకొల్లు రోజుల్లోలా 'ఏరా! ఏం సినిమారా ఇది? ఏమిటి కథ?' అని భుజం మీద చరిచేవాడు. సెట్లో అంతా ఆయన్ని గౌరవంగా చూస్తుంటే ఇతనొక్కడే ఎక్సెప్షన్. ఆ దర్శకుడు మహా ఇబ్బంది పడిపోయేవాడు. ఆ తర్వాత ఆ దర్శకుడే అతన్ని సెట్లో ఎప్పుడయినా చూస్తే 'ఏరా, ఎప్పుడొచ్చావ్? ఏమిటి?' అని చనువుగా భుజం తట్టి పలకరించేవాడు. దాంతో వాళ్ళిద్దరు మంచి ఫ్రెండ్స్ అనుకున్న సెట్లోని వారి ముందు ఆ దర్శకుడు ఎబ్బెట్టుగా ఫీలయ్యేవాడు కాదు.

కొందరు 'స్నేహం నా ప్రాణం' అంటూ కబుర్లాడుతుంటారు. కాని 'స్నేహం వాళ్ళ ప్రాణం' కాదు. ధనం! నాకు తెలిసిన ఓ రచయిత సరిగ్గా ఈ బాపతే. 'నా ఫ్రెండు' అని నన్ను అందరిలో చెప్తూనే నా వెనక గోతులు తవ్వే రకం అని తర్వాత్తర్వాత తెలిసింది.

కొందరు కేవలం డబ్బున్న వాళ్ళతోనో ఇన్‌ఫ్లూయెన్స్ వున్న వాళ్ళతోనో మాత్రమే స్నేహం చేస్తారు తప్ప తమకన్నా కింది స్థాయి వారితో చస్తే స్నేహం చేయరు. ఇలాంటివారు 'ఏ ఫ్రండ్ ఇన్ డీడ్' అనే సూక్తిని నమ్మే రకాలు. అంటే తమ అవసరానికి సాయపడే మిత్రుడు కావాలి అని నమ్ముతుంటారు వీరు. వీళ్ళు ఏ.పి.ఎస్.ఇ.బి., హైదరాబాద్ ఆటో రిషా డ్రయివర్లు, మునిసిపల్ కార్పొరేషన్ కలిగించే అసౌకర్యానికి పది రెట్లు ఎక్కువగా మిత్రత్వం ముసుగు వేసుకుని మనకి ఇబ్బంది కలిగిస్తుంటారు.

కొందరితో తక్కున ఫ్రెండ్‌షిప్ చేయాలనిపిస్తుంది. కొందరిని చూస్తే మళ్ళీ జీవితంలో కలవబుద్ధి కాదు. కొందరు నిస్వార్థంగా స్నేహం చేస్తారు. తమకొచ్చే విమల్ లేదా గార్డెన్ డిస్కౌంట్

కూపన్స్‌ని తమ మిత్రబృందంలో ఎవరికి కావాలో విచారించి మరీ ఇస్తారు. పెళ్ళి సంబంధాలు కుదురుస్తారు. అవసరానికి అప్పు ఇస్తారు. అద్దెకి ఇల్లు వెదికి పెడతారు. కొందరు ఎంత గాఢంగా స్నేహం చేసినా ఒక్క పైసా విదల్చరు.

మగవాళ్ళ మధ్యకన్నా ఆడవాళ్ళ మధ్య స్నేహం ఎక్కువ కాలం బ్రతుకుతుంది. స్నేహం శాశ్వతంగా నిలిచేది, ఓ మనిషిని అతని బలహీనతలతో సహా స్నేహితుడిగా అంగీకరించినప్పుడే. 'నిజానికి స్నేహం చేయడానికి మంచి సమయం వాళ్ళతో మనకి అవసరం రాకమునుపే' అనేది ఆంగ్ల సూక్తి. చాలామంది 'అతనితో ఎప్పుడు ఏ అవసరం వస్తుందో" అన్న పద్ధతిలో చాలామందితో స్నేహం చేస్తుంటారు. బలమయిన స్నేహానికి కులం అడ్డు రాకూడదు. కాని ఆ మధ్య రెండు మూడు కులాల మధ్య తగవు పబ్లిక్ అవగానే కాలేజి హాస్టల్స్ దాకా కులతత్వం పాకి, చాలా కాలేజీల్లో, హాస్టళ్ళలో 'శతృకులం' వారితో ఫ్రండ్‌షిప్ కట్ చేయడం జరిగింది.

మనుషుల మధ్యకాక కుటుంబాల మధ్య (ఫేమిలి ఫ్రండ్స్), దేశాల మధ్య కూడా మైత్రి సాగుతూంటుంది. కెనడా, అమెరికాలు జిగ్రీ దోస్తులు. అబ్రహం లింకన్ ఈ విషయం మీద చక్కటి ఆలోచన చెప్పాడు 'నీ శతృవుని నాశనం చెయ్యాలనుకుంటే అతనితో ఫ్రెండ్‌షిప్ చెయ్యి!' ఇది పాటించడానికిఎంతో సత్తా కావాలి.

'ఓ శతృవు చిరునవ్వుకన్నా ఓ మిత్రుడి కోపం మంచిది'అనే కొటేషన్ కూడా వుంది. ఆ మాటకొస్తే ఫ్రండ్‌షిప్ మీద చాలా చక్కటి కోటేషన్స్ వున్నాయి. వాటిలో కొన్ని....

—విజయవంతమైన పెళ్ళంటే రెండు సెక్స్‌లమధ్యగల చక్కటి స్నేహం.

—ఓ మంచి మిత్రుణ్ణి పొందడానికి సంవత్సర కాలం కూడా సరిపోకపోవచ్చు. కాని ఓ మంచి మిత్రుణ్ణి పోగొట్టుకోవడానికి అరగంట చాలు.

– మిత్రుడి ఇంటికి దారి ఎప్పుడూ దూరం కాదు.

– ఓ మిత్రుడి ముందు నువు ఏడవడానికి జంకకపోతే అతను నీ ప్రాణ స్నేహితుడుగా భావించవచ్చు.

– నీ కాలాన్ని కన్నీళ్ళతో కాక చిరునవ్వులతో కొలు. నీ జీవితాన్ని సంవత్సరాలతో కాక నీవు పొందిన స్నేహితులతో లెక్కించు.

– నిజమైన స్నేహం నెమ్మదిగా పెరిగే చెట్టులాంటిది

– బంధువు వారసత్వం వల్ల, మిత్రుడు ఆప్షన్ వల్ల.

– గంట వయసు గల గుడ్డు, ఓ రోజు వయసు గల బ్రెడ్, ఓ సంవత్సరం వయసుగల వైన్, ముప్పైఏళ్ళగల స్నేహం ఆరుదే అయినా వుండవలసినవి.

ఫ్రండ్‌షిప్ మీద నవ్వొచ్చే కొటేషన్స్ కూడా ఉన్నాయి.

– స్నేహం అదేది జీవిత కాలం సాగే అందమైన సంబంధం, అప్పు తిరిగి తీర్చమని అడగనంతవరకూ

– మనిషిని అప్పు తీర్చమని అడిగీ, ఇంకా అతని ఫ్రండ్‌గా వుండగలగడం గొప్ప.కళ.

– కొందరు మిత్రులు ఇంగ్లీష్ అక్షరం 'పి' లాంటినారు. పిటి (pity) లో మొదటి వారు. హెల్ప్ (help) లో చివరివారు.

– ఒకరి దగ్గర నించి అప్పు తీసుకునేంత సాన్నిహిత్యం వుంటే అతను మన మిత్రుడు. అతను మన దగ్గర నించి అప్పు తీసుకోవాలనుకుంటే అతను కేవలం పరిచయస్థుడు.

– అప్పు ఎక్కువగా ఇస్తే మిత్రులు శతృవుగా మారుతారు.

– మంచి మిత్రుణ్ణి చూడాలనుకుంటే అద్దంలో నీ ప్రతిబింబాన్ని చూసుకో.

– ఓ మిత్రుణ్ణి వదిలించుకోవాలంటే అతను ఏ విషయాల్లో తప్పు చేస్తున్నాడో చెప్పి సలహాలివ్వు.

– ప్రతి మనిషికి ఇద్దరు మిత్రులుండాలి. ఒకరు మాట్లాడితే వినడానికి. ఇంకొకరు అతని గురించి మాట్లాడడానికి.

స్నేహితులు చిన్నప్పటి నుంచే వుండాలి, ఒంటికాయి

కొంతికొమ్మలా మిత్ర రహితంగా గడిపేవారు పెద్దయ్యాక అనేక మానసిక సమస్యలని తేలిగ్గా ఎదుర్కోలేరు. తలిదండ్రులు కూడా పిల్లల స్నేహితుల విషయంలో ఎలాంటి ఆంక్షలు పెట్టకూడదు, 'అడ్డమయిన వాళ్ళతో తిరగకు' అంటూ. ఎందుకంటే స్నేహం అనేది స్వంత ఎన్నికతో జరిగే క్రియ. ఎవరి అభిరుచి మేర వాళ్ళే స్నేహితులని ఎన్నుకుంటారు. అందుకే సామెత వచ్చింది. 'నీ స్నేహితులెవరో చెప్పు. నువ్వెవరో చెప్తాను' అని.

స్కూళ్ళల్లో, కాలేజీల్లో 'ఓల్డ్ స్టూడెంట్స్ డే'లు జరపడానికి కారణం దూరమయిన పాతమిత్రులని కలపడానికే. స్నేహం అనేది ఎంతో అమూల్యమయింది. అకస్మాత్తుగా ఇరవై ఏళ్ళ తర్వాత ఓ కాలేజీ మిత్రుడు తారసపడితే ఎంతో ఆసక్తిగా ఫలానవాడెక్కడున్నాడు, ఫలానా వాడు ఏం చేస్తున్నాడు' అంటూ తన పాత మిత్రుల వునికిని తెలుసుకోడానికి ప్రయత్నిస్తుంటాం.

ఇదంతా సేమ్ సెక్స్‌కి సంబంధించిన స్నేహం. అపోజిట్ సెక్స్ మధ్యగల స్నేహం అమలిన శృంగారానికో, వివాహానికో, అక్రమ సంబంధానికో దారి తీస్తూంటడం కద్దు. 'అందమైన జీవితం' అనే నా నవల పెళ్ళయిన స్త్రీ, పురుషుల మధ్య సెక్సేతర స్నేహం సాధ్యం అన్న పాయింట్ మీద అల్లబడింది. దానికి పాఠకురాళ్ళ నుంచి వచ్చిన రెస్పాన్స్‌ని బట్టి చూస్తే అక్రమ సంబంధాలకి దారి తీయని స్వచ్ఛమైన మగ స్నేహితులని నేటి మధ్య తరగతి తెలుగు మహిళలు కోరుకుంటున్నారనిపించింది. అందుకే కామోసు ఓ చైనీస్ మేధావి అన్నాడు, భార్యకి తనని అర్థం చేసుకునే భర్త, స్వంత ఆదాయం, స్వచ్ఛమైన మిత్రుడు వుండటం గొప్ప వరాలని.

సినిమాల్లో విలన్ వేషాలేస్తున్న బెనర్జి అనే అతను నాకు మంచి మిత్రుడు. అతనికి స్నేహం అంటే ప్రాణం. అతని ఫ్రండ్స్ సర్కిల్ చాలా ఎక్కువ. తరచు వాళ్ళని కలవడమో, కనీసం ఫోన్‌లో పలకరించడమో చేయకుండా వుండలేడు. మద్రాస్ వచ్చిన తన మిత్రులని ఏమాత్రం ఫ్రీగా వున్నా వచ్చి చూడకుండా వుండలేడు.

ఎలాంటి స్వార్థం లేకుండా స్నేహం కోసమే స్నేహం చేసే, నాకు తారసపడ్డ ఏకైక వ్యక్తి బెనర్జి. స్కూల్లో చదువుకున్నప్పటి కాలంలోని ఫ్రండ్స్‌ని కూడా అతను పోగొట్టుకోకుండా 'టచ్'లోనే వున్నాడు.

అతన్ని చూస్తే అనిపిస్తుంది నాకు, 'ఈ ప్రపంచంలో అపరిచయస్థులంటూ ఎవరూ వుండరు, మనని మీట్ అవడానికి వెయిట్ చేసే స్నేహితులే తప్ప' అని. అందుకే ప్రేమ కన్నా ఫ్రెండ్‌షిప్ గొప్పది. దాన్ని వయసుతో పని లేకుండా ఎక్కువ కాలం కొనసాగించవచ్చు. అకారణ ద్వేషం అధికం అవుతున్న ఈ కాలంలో అందరూ గుర్తుంచుకోవాల్సింది ఒకటుంది. ఎంత నిరుపయోగమైన వ్యక్తి స్నేహం అయినా, అతనితో శతృత్వం కన్నా గొప్పది.

తన కేలండర్‌లో తమ మిత్రుడికి కొంత సమయం కేటాయించ గల వ్యక్తి స్నేహం ఇంకా గొప్పది. ఎందుకంటే స్నేహితుడు సంతోషాన్ని రెట్టింపు చేసి, దుఃఖాన్ని సగం చేస్తాడు.

## ఆనందం అంటే?

ఆనందం అనేది వాస్తవం కాదు. ఓ మనిషిపాయింట్ ఆఫ్ వ్యూ. ఓ ఏంగిల్ నించి చూస్తే ఓ సంగతి ఓ మనిషికి ఆనందాన్ని కలిగిస్తే అది ఇంకొకరికి అంత ఆనందాన్ని కలిగించకపోవచ్చు. కాబట్టి ఆనందం రెలిటివ్ ఫీలింగ్ మాత్రమే.

పదిలక్షలు లాటరీ తగలడం, బంగారం బిస్కెట్లు పెట్టె రైల్లో దొరకడం, కోటిన్నర రూపాయల విలువచేసే తాతయ్య ఆస్తి మొత్తం మనకే రావడం అందరికీ ఆనందాన్ని కలిగిస్తుంది. అలాంటి ఆనందాల గురించి కాదు నేను ప్రస్తావించేది. అవి అందరికీ జీవితకాలంలో ఒక్కసారయినా జరక్కపోవచ్చు. కాని చిన్న చిన్న విషయాలు